క్లుప్తంగా

గుంతల రహదారికి మరమ్మతు



మరమ్మతు పనులు చేయిస్తున్న సారయ్యగౌడ్

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్ మెయిన్ రోడ్‌లో మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ కాల్వరాంచంద్రారెడ్డి నివాస గృహం సమీపంలో గుంతల రోడ్డును మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్ శనివారం మరమ్మతు చేయించారు. చెరువు మట్టి లారీలతోపాటు ఇసుక లారీలు ఓవర్ లోడ్‌తో ఈ రహదారిపై నుంచి వెళ్లడంతో గుంతలు పడి వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గ్రామస్తుల విన్నపం మేరకు మాజీ ఎంపీపీ మరమ్మతు చేయించారు. దీంతో గ్రామస్తులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఏఎంసీ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, వైస్ చైర్మన్ సబ్బని రాజమల్లు, మాజీ సర్పంచు మాదాసు సతీశ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ నిధులతో బోర్‌వెల్స్ ఏర్పాటు



పనులు ప్రారంభిస్తున్న సూర్యనారాయణ

ధర్మారం: ఎంపీ గడ్డం వంశీకృష్ణ తన నిధుల నుంచి మండల కేంద్రంలో రెండు బోర్‌వెల్స్ మంజూరు చేయగా శనివారం నిర్మాణ పనులను మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కాడే సూర్యనారాయణ ప్రారంభించారు. ధర్మారంలోని పోచమ్మ వీధిలో ఒక్కటి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల వీధిలో మరొక బోర్‌వెల్ వేశారు. కాంగ్రెస్ నాయకులు కరాటే వేణు, దేవి కిషోర్, శాతరాజుల సుమన్, కాల్వ నర్సింగం, కంసాని ఎల్లయ్య, ఎండీ అష్షు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా తిరుమల్‌రావు



ఎన్నికైన నూతన కార్యవర్గం

సుల్తానాబాద్: సుల్తానాబాద్ లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని శనివారం పట్టణంలోని ఇండియన్ పబ్లిక్ స్కూల్ ఆవరణలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జూపల్లి తిరుమల్‌రావు, ప్రధాన కార్యదర్శిగా సుధీర్‌రావు, కోశాధికారిగా తమ్మనవేని సతీశ్, ఉపాధ్యక్షుడిగా సాంబమూర్తి, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ప్రమాణ స్వీకరణ చేయించారు. పూర్వ జిల్లా గవర్నర్ విజయ, క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నూతన నియామకం



సదానందం

సుల్తానాబాద్‌రూరల్: మున్నూరుకాపు డెవలప్‌మెంట్ ఫోరం (ఎండీఎఫ్) రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా మండంలోని కనుకుల గ్రామానికి చెందిన ఉప్పు సదానందంను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు ఎడ్ల రవికుమార్ పటేల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మున్నూర్‌కాపు సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని సదానందం అన్నారు.

రైతుభరోసా దరఖాస్తుల స్వీకరణ

రామగుండం: ప్రస్తుత 2025–26వ వర్షాకాలం పంట సాగు చేసే రైతులు జూన్ 5వ తేదీలోగా కొత్తగా పట్టాదారు పాసు పుస్తకం/భూ భారతిలో నమోదైన పట్టాదారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అంతర్గాం మండల వ్యవసాయాధికారి కల్వల సతీశ్ తెలిపారు. కాగా గతంలో రైతు భరోసా పొందుతున్న రైతులు దరఖాస్తు చేసుకునే అవకాశం లేదన్నారు. ఈనెల 20లోగా అర్హులైన రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకాలు ఉదయం 11గంటల్లోగా పూర్తి వివరాలతో రైతు భవన్‌లో మండల విస్తీర్ణాధికారికి అందజేయాలని కోరారు.

ఒప్పంద అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్‌లో ఉన్న ఆదర్శ విద్యాలయంలో గంటల పద్ధతిలో ఒప్పంద అధ్యాపక ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ షాదూల్ తెలిపారు. పీజీటీ తెలుగు, పీజీటీ ఎకనమిక్స్, టీజీటీ తెలుగు, టీజీటీ హిందీ పోస్టులకు సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ చదివిన అభ్యర్థులు ఈనెల 16న తెలంగాణ మోడల్ స్కూల్ పెద్దాపూర్‌లో డెమో క్లాసులకు హాజరు కావాలని సూచించారు. విద్యార్హతలకు సంబంధించిన ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలు వెంట తీసుకురావాలన్నారు.

పెద్ద మోరీ.. పూడిక తొలగించరేమి?

- చిన్నపాటి వర్షానికే పెరుగుతున్న వరద



పట్టణంలోని పెద్ద మోరీలో పెరిగిన తుంగ

రామగుండం: పట్టణంలోని పెద్ద మోరీలో చిన్నపాటి వర్షానికే వరద ప్రవాహం పెరిగింది. ఏటా ఎన్టీపీసీ యాజమాన్యం వర్షాకాలానికి ముందే పొక్లెయిన్‌తో పెద్ద మోరీలో పెరిగిన తుంగ, పిచ్చిమొక్కలు, సిల్ట్ తొలగింపు, ఇరువైపులా ఒడ్డుపై పెరిగిన మొక్కల తొలగింపు ప్రక్రియ చేపడతారు. దీంతో వచ్చిన వరద నేరుగా పెద్ద చెరువులోకి వెళ్తుంది. కానీ ఈ ఏడాది ఎన్టీపీసీ ఎలాంటి ముందస్తు పనులు చేపట్టకపోవడంతో చిన్నపాటి వర్షానికే వరద నీటి ప్రవాహం పెరగడంతో పట్టణ ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. గతేడాది పెద్ద మోరీలో పూడిక తొలగింపు పనులను ఎన్టీపీసీ చేపట్టడంతో భారీ వర్షాలకు సైతం ఎలాంటి వరద ముప్పు లేకుండా పోయింది. పెద్ద మోరీలో ఎన్టీపీసీ నుంచి విడుదలయ్యే బూడిద నీరు చెరువులోకి చేరుతుండడంతో నీటిలో కొట్టుకువచ్చే బూడిద పేరుకుపోయి కాలువ కుంచించుకుపోతుంది. దీని కారణంగానే ఏటా పొక్లెయిన్ సాయంతో పూడికతీత పనులు చేపడుతుంటారు. అయితే భారీ వర్షాలు కురిస్తే పాత బజార్, జెన్ క్వార్టర్లు, డీ–టైప్ కాలనీలు వరద ముంపులోకి చేరే ప్రమాదం ఉందని కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. ఎన్టీపీసీ యాజమాన్యం స్పందించి పెద్ద మోరీలో పెరిగిన తుంగ, పిచ్చిమొక్కలు, సిల్ట్ తొలగింపు పనులు చేపట్టాలని స్థానిక ప్రజలు విన్నవిస్తున్నారు.

మంత్రి వివేక్ వెంకటస్వామికి స్వాగతం



పెద్దపల్లిలో మంత్రికి గజమాలతో సన్మానం

పెద్దపల్లిరూరల్: కార్మిక ఉపాధిశాఖ, గనులశాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి శనివారం పెద్దపల్లికి రాగా పీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ భూషణవేని రమేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో గజమాలతో ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పెద్దపల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ ఎలువాక రాజయ్య, కాంగ్రెస్ నాయకులు అక్కపాక నరేశ్, తూముల శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీలు బుర్ర తిరుపతిగౌడ్, ఆవుల ముక్తేశ్వర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు దొడ్డె స్వామి, ఎన్ఎస్‌యూఐ నాయకులు కోదాడి ప్రశాంత్‌రాజ్ పాల్గొన్నారు.

సుల్తానాబాద్‌లో..

సుల్తానాబాద్: మంత్రిగా బాధ్యతలు స్వీకరించి తొలిసారిగా నియోజకవర్గానికి వెళ్తున్న మంత్రి గడ్డం వివేక్‌కు సుల్తానాబాద్‌లో శనివారం కాంగ్రెస్ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం కాంగ్రెస్ శ్రేణులు గజమాలతో మంత్రిని సన్మానించారు. నాయకులు కల్వల శ్రీనివాస్, కోడెం అజయ్, కొమురయ్య, న్యాతరి శ్రీనివాస్, దేవేందర్, రాంరాజ్, సజ్జద్, శ్రీధర్ పాల్గొన్నారు.

మంత్రి 'అడ్లూరి'కి సన్మానం



సన్మానిస్తున్న స్వర్ణకారుల సంఘం నాయకులు

ధర్మారం: మండల స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమశాఖ మంత్రి లక్ష్మణ్‌కుమార్‌ను సన్మానించారు. ధర్మపురి క్యాంపు కార్యాలయంలో శనివారం మండల స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడు మూటపల్లి తిరుపతి, ప్రధాన కార్యదర్శి పూసాల శ్రీధర్ ఆధ్వర్యంలో సంఘం నాయకులు మంత్రిని కలిసి సన్మానించారు.

విద్యారంగ సమస్యల పరిష్కారంలో విఫలం



నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పెద్దపల్లిరూరల్: విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు శనిగరపు రజనీకాంత్ ఆరోపించారు. పెద్దపల్లిలో స్థానిక బస్టాండు చౌరస్తా వద్ద శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచిపోయినా.. సమస్యలు సమీక్షించడానికి కనీసం విద్యాశాఖమంత్రి లేనటువంటి దుస్థితి ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రయివేట్ కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలన్నారు. సంవత్సరాల తరబడి ఫీజు రియింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను మంజూరు చేయడం లేదని విమర్శించారు. ప్రభుత్వం పెంచిన విద్యార్థుల బస్‌పాస్ చార్జీలను వెంటనే తగ్గించాలన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ల సందీప్, జిల్లాల ప్రశాంత్, జిల్లా ఉపాధ్యక్షుడు బందెల రాజ్‌కుమార్, జిల్లా కమిటీ సభ్యులు తమనవేని అభిరామ్, దుర్గం రాజు, నాయకులు గణేశ్, చంద్రకాంత్, మహేందర్, ప్రశాంత్, నరేందర్, సిద్ధార్థ, ఆదిత్య పాల్గొన్నారు.

శిక్షణ అభ్యర్థులకు సర్టిఫికెట్లు



సర్టిఫికెట్లు అందజేస్తున్న జీఎం గోపాల్‌సింగ్

గోదావరిఖని: టీటీసీలో వోల్వో డంప్ ట్రక్ శిక్షణ పొందిన అభ్యర్థులకు ఆర్జీ–1 ఎస్‌టోటూ జీఎం గోపాల్‌సింగ్ శిక్షణ శనివారం సర్టిఫికెట్లు అందజేశారు. 54 మంది శిక్షణ పొందగా, 47మంది ఉత్తీర్ణులయ్యారు. కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ ఎం.రవీందర్‌రెడ్డి, టీటీసీ ఎస్ఈ అశోక్‌కుమార్, వోల్వో డంప్ ట్రక్ కంపెనీ ట్రైనింగ్ మేనేజర్ హరిబాబు, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ వేణు, రాంబాబు, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

అక్బర్‌నగర్‌లో అంగన్‌వాడీ బడిబాట



కాలనీలో బడిబాట



చిన్నారులకు అక్షరాభ్యాసం

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని అక్బర్‌నగర్‌లో శనివారం అంగన్‌వాడీ బడిబాట నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలోని చిన్నారుల ఇళ్లకు నేరుగా వెళ్లి అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని పేరెంట్స్‌కు అవగాహన కల్పించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. అంగన్‌వాడీ టీచర్ తిరుమల, ఆయా రేవతి, ఏఎన్ఎం, కాంగ్రెస్ అంతర్గాం మండల మహిళా అధ్యక్షురాలు నాజియాసుల్తానా పాల్గొన్నారు.

ధర్మారం లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా మల్లేశం



ధర్మారం: ధర్మారం లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా ఇప్ప మల్లేశంను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం ఏర్పాటు చేసిన లయన్స్‌క్లబ్ సర్వసభ్య సమావేశంలో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఇప్ప మల్లేశం, ప్రధాన కార్యదర్శిగా భూతగడ్డల రవి, కోశాధికారిగా మిట్టపల్లి చంద్రకాంత్‌రెడ్డిని ఎన్నుకున్నారు. కాగా కొంతకాలంగా లయన్స్‌క్లబ్‌లో కొనసాగుతూ క్లబ్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేసిన వీరి సేవలు గుర్తించి సభ్యులు ఏకగ్రీవంగా కమిటీని ఎన్నుకున్నారు.

నేడు ప్రమాణ స్వీకారం

లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గం ఈ నెల15న ఎర్రగుంటపల్లిలోని మహేశ్వర ఫంక్షన్‌హాల్‌లో ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు ప్రోగ్రాం చైర్‌పర్సన్ రాజేందర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా కేబినెట్ కార్యదర్శి సింగిరెడ్డి వాసుదేవారెడ్డి, జిల్లా కేబినేట్ ట్రెజరరీ గాలిపల్లి వెంకట్, జిల్లా మైక్రో కేబినేట్ అడిషనల్ సెక్రటరీ సామ ఎల్లారెడ్డి, రీజియన్ చైర్మన్ మునీందర్‌రెడ్డి పాల్గొంటారని ఆయన తెలిపారు. అదేవిధంగా మండలంలోని దొంగతుర్తి లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం సైతం ఇదే ఫంక్షన్‌హాల్‌లో జరగనున్నట్లు ఆయన తెలిపారు.

రోడ్డుపైనే వాహనాల పార్కింగ్



శ్రీరాంపూర్ క్రాస్‌రోడ్ వద్ద రోడ్డుపై నిలిపి ఉన్న వాహనాలు

సుల్తానాబాద్: పట్టణంలోని కాల్వశ్రీరాంపూర్ చౌరస్తా వద్ద ఇరువైపులా రోడ్డుపైనే వ్యాపారం చేస్తుండడంతో పాటు వాహనదారులు రోడ్డుపైనే వాహనాలు నిలపడంతో ప్రయాణికులు, ప్రజలు అనేక రకాలుగా ఇబ్బంది పడుతున్నారు. భారీ వాహనాలు వచ్చినప్పుడు ప్రమాదాలు సంభవిస్తున్నట్లు వారు వాపోతున్నారు. రహదారి విస్తీర్ణం తక్కువగా ఉండడంతో పాటు రోడ్డుపైనే వ్యాపారం చేస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. షటర్ నిర్వాహకులు ముందు భాగంలో వ్యాపారాలు నిర్వహించకుండా, వాహనాలు రోడ్డుపైనే నిలపకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వానరాలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్‌లో బంధిస్తున్న వానరాలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని బీజేపీ ఎన్టీపీసీ రామగుండం మండల అధ్యక్షుడు మిట్టపల్లి సతీశ్‌కుమార్ ఒక ప్రకటనలో కోరారు. వానరాలకు జీవన యోగ్యమైన అటవీ ప్రాంతాలకు తరలించాలని మున్సిపల్ అధికారులను విజ్ఞప్తి చేశారు.

వెలవెలబోతున్న వారసంత



రామగుండం: పట్టణంలోని అంతర్గాం వెళ్లే ప్రధాన రహదారి సమీపంలో ప్రతీ ఆదివారం జరిగే వారసంత నిర్వహణ కొన్ని దశాబ్దాలుగా కొనసాగుతోంది. కాగా ఇటీవల కాలంలో పట్టణంలోని జెన్‌కో బీ–థర్మల్ విద్యుత్ కేంద్రం మూతపడడంతో ఇప్పటికే 70 కుటుంబాలు బదిలీపై వెళ్లగా మరో 60 కుటుంబాలు బదిలీపై వెళ్లనున్నాయి. దుకాణదారులు, టీస్టాల్స్ వ్యాపారం తగ్గిపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తుండగా, క్రమంగా సండే మార్కెట్ సైతం కళ తప్పింది. గరిష్ఠంగా పది మంది సైతం విక్రయదారులు లేకపోవడం, 20 మంది కొనుగోలుదారులు మించకపోవడం గమనార్హం. అన్ని రకాల ఆకు కూరలు, కూరగాయల లభ్యత తగ్గిపోయింది. దీంతో సమీపంలోని ఎన్టీపీసీ మార్కెట్‌కు వినియోగదారులు తరలివెళ్తుండడంతో రామగుండం సండే మార్కెట్ వెలవెలబోతోంది.

అనుమతి లేని పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

గోదావరిఖనిటౌన్: నగరంలో అనుమతి లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల ఐక్యవేదిక నాయకులు శుక్రవారం మండల విద్యావనరుల కేంద్రంలో సీఆర్పీ కె.వెంకటేశ్‌కు వినతిపత్రం ఇచ్చినట్టు విద్యార్థి సంఘాల నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కమాన్‌పూర్: మండలంలోని రొంపికుంట గ్రామంలోని శ్రీవివేకానంద హైస్కూల్లో 2008–09లో పదో తరగతి వరకు చదివిన పూర్వ విద్యార్థులు శనివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను సన్మానించారు.



సుల్తానాబాద్: పట్టణంలో వ్యాపార కాంప్లెక్స్ నిర్మాణ పనుల్లో మున్సిపల్ కార్యాలయం వాటర్ ట్యాంకర్ వినియోగించడం విమర్శలకు తావిస్తోంది. పనులు జరుగుతున్న ప్రాంతంలో మున్సిపల్ ట్రాక్టర్ ద్వారా నీరు తీసుకొస్తున్నారు. ఇలా చేయడం ప్రజాధనం దుర్వినియోగం కాదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. పలుకాలనీల్లో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉన్నప్పటికీ కాంట్రాక్టర్‌కు ట్యాంకర్‌తో నీరు సరఫరా చేయడంపై అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

సింగరేణి వార్తలు

హక్కుల సాధనలో రాజీలేని పోరాటం



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న జనక్‌ప్రసాద్

గోదావరిఖని: సింగరేణి కార్మికుల హక్కుల సాధనలో రాజీలేని పోరాటం చేస్తున్నామని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ పేర్కొన్నారు. జీడీకే–11వ గనిలో శనివారం ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. మారుపేర్ల మార్పు సమస్య పరిష్కార దిశగా ముందుకు సాగుతోందని, దీనికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి సమస్యను పరిష్కరించేలా ముందుకెళ్తున్నామన్నారు. అనేక సమస్యల పరిష్కారంలో కీలకపాత్ర పోషించాలమన్నారు. వయోపరిమితి 40ఏళ్లకు పెంచడం, కాంట్రాక్టు కార్మికులకు రూ.5వేలు లాభాల వాటా, కార్మికులకు రూ.కోటి ప్రమాదబీమా అమలు చేయించిన ఘనత తమకే దక్కిందన్నారు. పెర్క్స్‌పై ఇన్‌కంటాక్స్ మాఫీ, కార్మికుల సొంతింటి పథకం అమలు, కార్పొరేట్ మెడికల్ బోర్డు నియామకాల్లో మార్పు, తొలగించిన మైనింగ్ సిబ్బందిని వన్‌టైం సెటిల్‌మెంట్ కింద ఉద్యోగాల్లోకి తీసుకోవడం, వంద రోజుల్లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం, సింగరేణి ఆధ్వర్యంలో ఐటీ సంస్థ ఏర్పాటు చేయడంపై తాము దృష్టిసారించామని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు ధర్మపురి, సదానందం, గడ్డం కృష్ణ, గుండేటి శ్రీనివాస్, ఎదులపురం శ్రీనివాస్, గాదె సంపత్, గట్టు రాజు, కొండ శ్రీనివాస్, పృథ్వీరాజ్, ఎస్.రాజేశ్, విజయ్, విజయ్, హేమంత్‌కుమార్‌స్వామి, పదాల శ్రీనివాస్, సమ్మయ్య పాల్గొన్నారు.

బొగ్గు దొంగను పట్టుకున్న సీఐఎస్ఎఫ్ సిబ్బంది



బొగ్గు దొంగతనానికి పాల్పడిన వ్యక్తిని పట్టుకున్న సీఐఎస్ఎఫ్ సిబ్బంది

ఫెర్టిలైజర్‌సిటీ: ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని లక్ష్మీపురం గ్రామ శివారులో రైలు వ్యాగన్లలో నుంచి బొగ్గు దొంగిలిస్తున్నారన్న ఇంటెలిజెన్స్ సమాచారంతో శనివారం సీఐఎస్ఎఫ్ సిబ్బందితో దాడి నిర్వహించారు. బొగ్గు దొంగతనానికి పాల్పడుతున్న వి.శ్రీనును, బొగ్గు తరలిస్తున్న ఒక ట్రాక్టర్, మహేంద్ర బొలెరోను స్వాధీనం చేసుకొని ఎన్టీపీసీ పోలీసులకు సమాచారం అందించారు. పట్టుకున్న బొగ్గు సుమారు ఆరు టన్నులు, బొగ్గు విలువ రూ.30,000 విలువ ఉంటుందని తెలిపారు. ఎన్టీపీసీ ఏజీఎం హేమంత్ భిమ్సెన్ షిండే ఫిర్యాదులతో ఎన్టీపీసీ ఎస్సై ఉదయ్ కిరణ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పారిశుధ్య పనులు ప్రారంభం



పనులు చేపట్టిన మున్సిపల్ అధికారులు, సిబ్బంది

యైటింక్లయిన్‌కాలనీ: రానున్న వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఉండేందుకు 100రోజుల ప్రణాళికలో భాగంగా రామగుండం మున్సిపల్ అధికారులు ముందస్తుగా పారిశుధ్య పనులు చేపట్టారు. రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ 18వ డివిజన్ శ్రీపాదకాలనీ ఏరియాలో మున్సిపల్ అధికారులు సిబ్బందితో కలిసి శనివారం పారిశుధ్య పనులు ప్రారంభించారు. డివిజన్ ఏరియాల్లో రోడ్లకు ఇరువైపులా పేరుకుపోయిన ముళ్లపొదలు, చెత్తా చెదారం తొలగించారు. డ్రైనేజీలను శుభ్రం చేశారు. బ్లీచింగ్ పౌడర్‌తో పాటు నీరు నిలిచిన చోట ఆయిల్ బాల్స్ స్ప్రే చేయించారు. డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగభూషణం, సూపర్‌వైజర్ సారయ్య, వార్డు ఆఫీసర్ ఓదెలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

గోదావరి నదిలో గుర్తు తెలియని మృతదేహం

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని గోలివాడ గోదావరినదిలో శనివారం గుర్తు తెలియని మృతదేహాన్ని అంతర్గాం పోలీసులు గుర్తించారు. మృతుడు లైట్ బ్లూ కలర్ షర్ట్ ధరించి, లోపల టీ షర్ట్, బ్లాక్ కలర్ డ్రాయర్ ధరించి ఉన్నాడు. మృతుడు సుమారు 50ఏళ్లలోపు ఉండవచ్చని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని గోదావరిఖని ప్రభుత్వాసుపత్రి మార్చురీలో భద్రపరిచినట్లు అంతర్గాం ఎస్సై వెంకటస్వామి తెలిపారు. మృతుడి బంధువులు ఎవరైనా ఉంటే అంతర్గాం ఎస్సై ఫోన్‌నంబర్లు 8712656527, 9949493435కు సమాచారం అందించాలని కోరారు.